# ఎన్నెల్లు కాయాల

చేతిలోని బ్రీఫ్‌కేస్ కుర్చీలో పడేసి షూస్ విప్పకుండా పడకగది దగ్గరకు వచ్చాడు ప్రభాకర్.

అరుంధతి నిలువుటద్దం ముందు నుంచుంది స్ప్రే పెర్ ఫ్యూమ్ వాసనతో గది గుబాళిస్తోం ది సన్నగా టేప్ రికార్డర్ లో నుంచి పాట వినపడుతోంది.

'ముద్దబంతి పూవులో
మూగమనసు ఊసులో
ఎనక జనమబాసలూ
ఎందరికి తెలుసులే.....'

నిదానంగా చూశాడు మొదటిసారి భార్య వంక చూస్తున్నట్లు అయిదున్నర అడుగుల అరుంధతి సిగలో మల్లెచెండు తురుముకుంటోంది.

సౌరభం .... శృతి పేయమైనగీతం .... అరుంధతి ఇలా తయారవుతుండడం ఎందుకు చెప్మా పేరంటానికేమైనా బయలుదేరుతుందా ? ఉదయం ఏమీ అనుకోలేదు !

అరుంధతి వెనక్కి తిరిగి చూడలేదు. అలికిడి గమనించినట్టులేదు.

మెల్లగా గొంతు సవరించుకున్నాడు ప్రభాకర్

'' వచ్చారా ! ''

'' అలస్యమైందా ? ... ఇంతకీ ఏమిటీ మూగమనసురొద ? '' ఆనందం ఆర్ణవమయ్యే యీ సాయం సంధ్యవేళ ఎందుకీ మధురవిషాదం ?

టేప్ పక్కకుతిప్పి పెట్టాడు.

ఎన్నెల్లూకాయాల
ఎన్నెలకే మనమంటె కన్నుకుట్టాల ...'' పాట సగంలో మొదలైంది.

'' ఇప్పుడుచూడు ... కాదు.... విను... ఇదీ ఈ సందర్భానికి సరియైన పాట...''

'' మీరు వెంటనే బయలుదేరండి ! ... మీరూ నాతో రావాలి !''

'' పేరంటానికా ? నీకేం మతిపోయిందా ?''

'' పేరంటానిక్కాదు. పిల్లని చూసిరావడానికి, నెలరోజులవుతోంది ఉత్తరం ముక్కలేదు.''

'' ఉత్తరాలకీ ఉత్త ఉత్తరాలకి తీరిక ఉండే సమయమా మరి ... వాళ్లపని వాళ్లది ... ఆకులో ఆకునై పూవులో పూవునై నునులేత రెమ్మనై ఈ అడవి దాటిపోనా అనిపించే రోజులు...''

''కవిత్వం చాలించండి ... మీ వయసేమిటి ''

''ఇంకానయం జీతమెంత అని అడిగావ్ కాదు ..., ముప్పై ఏళ్ల సర్వీసు అంటే వచ్చే సంవత్సరం రిట్టైరైపోవాల్సి వస్తుంది. యాభై నిండకుండానే.... కాని అదేం ప్రశ్న .... వయసు శరీరానికి ... మనసుకి కాదే ''

'' మనవలుండాల్సిన మనకి మనవయసు ఎంతదో నా శరీరం వయసు మధ్యవయసేగా ''

'' ఇదీ అసలైన వయసు ... ఇదే అసలైన వయసు ... కాదని ఎవరినైనా అడిగిచూడు....''

'' మీ పుణ్యం ఉంటుంది బయలుదేరండి .... బ్యాగ్ సర్దేశా ...''

'' రడీ !''

'' అంటే, కాఫీ అక్కర్లేదా ?''

'' అమృత భాండం ముందుండగా క్షుద్ర పానీయమేల ?''

మంచం మీద కూర్చున్నాడు ప్రభాకర్.

అరుంధతి లోపలనుంచి కాఫీ తెచ్చి ఇచ్చింది అతను కప్పు క్రింద పెట్టేలోగా బ్యాగ్ తను తీసుకుని తాళం కప్పు భర్త చేతికందించింది.

'' మేఘసందేశమో అనురాగ సంకేతమో పంపితే బావుంటుందికాని ఇలా మనుషులమే వెళ్లిపోతే .... వాళ్ల ఏకాంతం ...''

అరుంధతి ఏమీ జవాబు చెప్పలేదు.

ఆటోలో అడిగింది '' మనం ఆడపిల్లకి పెళ్లిచేశామా ?''

'' చేస్తే?''

'' బాధ్యతతో మెలగాలి....''

'' నాకు అర్థం కావడంలేదు .... పిల్లకి పెళ్లిచేసి పంపించాం మానేశామా ? పెద్దాడు దూరంగా చదవుకుంటున్నాడు.... మొన్న నే కొత్తగా పెళ్లయినట్టుంది మనకి ... బాలాకుమారులు నిజానికి ఇంత ఇదిగా...''

'' మనకి సాంసారిక బాధ్యతకూడా ఉంది ''

'' ఓహ్ అదా సంగతి.... ఇదోరకం ప్రేమ యాత్రన్నమాట... ఏమిటో బృందావనాలు, నందనవనాలూ, కొడైకెనాలూ, కాశ్మీరాలూ - ఇవన్నీ ఎందుకో ..?''

అరుంధతి వారించలేదు. ఎదురు ప్రశ్న వెయ్యలేదు. సమాధానం చెప్పలేదు. పక్కకి తిరిగి ఆమె ముఖం చూశాడు.

ఆటో గౌలిగూడా బస్‌స్టేషన్ దగ్గర ఆగింది.

మీటరు చూడకుండా నోటు తీసి ఇచ్చేసి అరుంధతి రెక్కపుచ్చుకుని ముందుకు తీసుకెళుతూ అడిగాడు.

'' నువ్ చాలా ఆలోచనలో ఉన్నావ్ కదూ - నాకు మాత్రం సాంసారిక బాధ్యత లేదూ...''

ప్రభాకర్ ముఖంలో చటుక్కున వెలితి ....

'' మీరలా గంభీరంగా ఉండకండీ... మీరు ఆడుతూ పాడుతూ ఉంటేనే బాగుంటుంది...''

'' మరి నువ్వు ... ''

'' నేను ఆడదాన్ని ... మనం చెయ్యాల్సిన పనిచేసి తిరిగి వచ్చేవరకూ ...''

'' వచ్చేవరకూ ...''

'' ఆగమని నా ప్రార్థన ''

'' ఏమిటీ ఆగాలా ... ఎందుకని ...''

'' వాళ్లంటే కొత్త జంట. మనం పెద్దవాళ్లమైపోయాంగా ...''

'' నాకు మాత్రం అలా అనిపించటంలేదు. ఈ రెండు నెలల్లోనూ పది సంవత్సరాలు వయసు

తగ్గినట్టనిపిస్తోంది...''

'' ఊరుకోండి ... ఎవరయినా వింటే బావుండదు ...''

– బస్‌లో ముందుసీటులో పక్కపక్క కూచున్నారు దంపతులు.

బండి బయలుదేరిన ఐదునిముషాల్లో అరుంధతి భుజంమీద తలవాల్చి నిద్రపోయాడు ప్రభాకర్.

సిటీ లిమిట్స్ దాటిపోయాడేమో హెడ్ లైట్స్‌కి కాంతి కావల్సి వచ్చి బస్సులోపల లైట్లు ఆర్పేశాడు డ్రైవర్.

టిక్కట్టులేకుండా 'సినిమా చూసేస్తున్నారు ' అన్న దిగులు పోయి 'హమ్మయ్య' అనుకుంది.

తెల్లవారేసరికి బస్సు ప్రభాకర్‌రావ్ దంపతుల్ని దిగవిడిచి వెళ్లిపోయింది.

స్టాండులో చెప్పింది అరుంధతి '' మనం ప్రతి చిన్న విషయం జాగ్రత్తగా గమనించాలి... ప్రశ్నలు వేయడం వల్ల వాళ్లు ఎలా ఉంటున్నదీ తెలియదు .,. అసలే చిన్నతనాలు.... పెద్ద వాళ్లెవరూ తోడులేకుండా దూరం ఊళ్లో సొంత కాపురం ''

'' ఇంతకీ ఎన్నాళ్లు నీ క్యాంపు ? .... అక్కడ నువ్ ఉండిపోయి నన్ను ఒంటరిగా తిప్పి పంపెయ్యవుకదా ! అసలే నేను ఒక్కడినీ ఉండలేను ...''

'' ఇదెక్కడి గోలండీ ! ఇద్దరం కలిసే వచ్చేద్దాం ... ఇవాళెలాగూ శలవు... రేపు ఆదివారం సోమవారమూ శలవే ... మంగళవారం ఆఫీసుకు వెళుదురుగాని, సరేనా ?''

'' కాని అక్కడ రెండు రాత్రులు ... వాళ్ల మధ్య ...''

'' అబ్బ మీకెప్పుడూ అదే సొద ! ... అది ఎలా వంట చేసుకుంటుందో ... ఏం తింటున్నదో ... ఎలా ఇవేమీ మీరు ఆలోచించరా ?

'' నిజమే సుమా ! లక్ష్మికి అసలే వంటరాదు... స్టవ్ మీద పాలయినా దించిఎరగదు. సంగీతమనో, చదువనో, దాని హడావుడిలో అది వుండేది... కాని మరొకటీ వుందికదా వాళ్ల మధ్య మనం ఉండడం ... నాకైతే ఏదోలా ఉంటుంది ...''

'' మనం వచ్చింది వాళ్లనిచూడడం కోసం వాళ్ల ఏకాంతాన్ని భంగపరచడం కోసంకాదు. అయినా పిల్లకి మనని చూడాలనీ ఉంటుంది కదా ! అల్లుడితో మాటాడుతూ కూచుంటే. అతనికీ శలవుకదా అతనేం చెయ్యాలిమరి ...?''

'' సరే నువ్ అవేం చెప్పక్కర్లేదు.... ఆ మాత్రం నాకు తెలియదూ !''

– రిక్షా రివ్వున సాగిపోయింది.

'' కాఫీతో పేపరుండకపోతే బావుండదు ... వాళ్లు ఏం తెప్పించుకుంటున్నారో ... ఒకటి కొనుక్కుంటా ...''

రిక్షా ఆపి పేపరుకొన్నాడు ప్రభాకర్ .... అసలు వాళ్లని అంత పెందలాడే లేవగొట్టడం అతనికి ఇష్టంలేదు.

–బెల్ కొట్టిన ఐదు నిముషాల్లో రమేష్ తలుపు తీశాడు.

''ఓహ్ మీరా... రండి ! రండి ! ... ఉత్తరం రాయకుండానే వచ్చేశారే ! ... ఏయ్ లక్ష్మీ ....చూడు ఎవరొచ్చారో !''

కంగారుపడిపోయాడు కొత్త అల్లుడు.

'' కూచోండి !''

వెంటనే అతను చూపించిన కుర్చీలో కూర్చున్నాడు ప్రభాకర్.

అరుంధతి లోపలకి వెళ్లింది.

'' లక్ష్మీ! ఏయ్ లక్ష్మీ... ఏదీ ఇదెక్కడి కెళ్లిందీ ...'' అల్లుడు తలదించుకుని ఉండడం గమనించి గది దగ్గరకు వెళ్లి తలుపు తియ్యబోయింది. లోపల గడియవేసి ఉంది. -

'' ఇదేమిటీ అమ్మాయి తలుపు గడియపెట్టుకుని పడుకుందీ ?'' అంటూ భర్తనడిగింది....

'' ఏమో ?''

'' అల్లుడుగారేరీ ?''

'' బాత్‌రూమ్‌కి వెళ్లినట్టుంది... అయినా వాళ్లను మంచి నిద్రవేళప్పుడు లేవగొట్టేశావ్ - ఇంకా ఏడయినా కాలేదు... కొత్త దనం ...''

''ష్ ! అల్లుడు వింటే బాగుండదు...''

అరుంధతి వెళ్లి మెల్లగా తలుపుతట్టి పిలిచింది.

తలుపుతీస్తూనే '' అమ్మా, నువ్వా ... ఎంత సేపయింది వచ్చి ? నాన్నగారు వచ్చారా ?''

''ఇప్పుడేనే వచ్చాం ... ఇద్దరం వచ్చాం ....అల్లుడు ఈ గదిలో ... నువ్ ....''

'' ఆయన అవతలిగదిలో పడుకున్నారులే ... తలుపెవరు తీశారు ?''

'' మీ ఆయనేనే ...''

'' ఏమండీ ! అల్లుడుగారేరండీ ?''

'' ఏమో ! ... నేను పేపరు చూస్తున్నాను - అతను ...''

'' ఇక్కడ చెప్పుల్లేవు ... ఆయన బయటకి ''

'' నీ సిగ్గుబొగ్గులవ .... అతను ఆ గదిలో పడుకుంటే నువ్ ఈ గదిలో తలుపు గడియ పెట్టుకుని పడుకుంటావా ? ఇదెక్కడి చోద్యం ?''

'' తెలికగా చెబుతాంకాని... మీరు ముఖాలు కడుక్కున్నారా ? పాలొచ్చాయో లేదో ...''

వంటగదిలోకి వెళ్లింది లక్ష్మి

'' పాలు ఇంకా రాలేదు ... పాలకేవెళ్లి ఉంటారు... వీధి చివరేలే ... నేను డికాషన్ చేస్తా''

'' బావుంది... అవన్నీ నే చూసుకుంటా నువ్ ముందు ముఖం కడుక్కో''

'' నాన్నగారూ, అన్నయ్య దగ్గర నుంచి ఉత్తరాలు వస్తున్నాయా ? నాకు రాశాడు .... నేను జవాబే ఇవ్వలేదు ... ఏదో ఒక సందడి''

'' ఆఁ ! ఏమిటి ? '' తలఎత్తి అడిగాడు ప్రభాకర్

'' ముఖం కడుక్కుంటారా ?''

'' ఓయస్ ! అమ్మేది ? నా బ్రష్....''

తంతా ముఖాలు కడుక్కునేసరికి రమేష్ పాలూ, ఇడ్లీ పొట్లాలూ తీసుకునివచ్చాడు.

'' అరెరె ! అల్లుడుగారు తెచ్చారా ?'' కంగారుగా అన్నాడు ప్రభాకర్.

''పనిమనిషి ఈరోజు రాలేదు ... నాకేమో వారం రోజుల్లో టెస్ట్ ఒకటుంది ... ఐదింటికి లేచి

కొంచెం ప్రేపేరవుతున్నా .... అంతా కులాసాయేనా ?''

'' ఆఁ! ఏమిటా టేస్ట్!''

'' రొటీన్ లెండి ... డిపార్ట్మెంట్దే అయినా రాత్రంతా నిద్రలేకుండా బస్లో వచ్చారా.... రైల్లో అయితే ...''

'' ఫరవాలేదులే ... పెద్దవాళ్లం కదా! ఆఫీసులో పనీ అదీ సులువుగా ఉందా !.... మీ అమ్మగారూ, నాన్నగారూ... అంతా బాగున్నారా ? నాకయితే ఉత్తరాలు రాయడమంటే మహా బద్ధకం...'' గబగబా అనేసి పేపర్లో రాజీవ్ గాంధీ అమెరికా పర్యటన విశేషాల్లో మునిగిపోయాడు.

'' అల్లుడుగారికి కాఫీ ఇయ్యి !'' అరుంధతి లక్ష్మి చేతికి కప్పు అందించింది.

అప్పటికే స్నానాలగదిలోకి దూరిపోయాడు రమేష్. బయటకి రావడం, కాఫీ తాగడం, బట్టలు వేసుకుని '' ఎనిమిదింటికి ఒక ఎపాయింట్ మెంట్ వుంది వెళ్లి ఓ గంటలో వచ్చేస్తా'' అని చెప్పి వెళ్లిపోవడం కొద్ది క్షణాల్లో జరిగిపోయాయి.

'' అవునే అమ్మాయ్! ఏమిటీ వ్యవహారం, మీరిద్దరూ విడివిడిగా వేరువేరుగదుల్లో....''

'' ఏం లేదమ్మా ...''

'' నాతో చెప్పడానికేం ? మాటామాటా అనుకున్నారా ?''

'' నాన్నగారు వింటారేమో ... ఆ గదిలోకి పోదాం ...''

'' ఆయన సంగతి నీకు తెలియనిదా ? అదో మాయలోకం. అల్లుడు బయటకు వెళుతూ ఉంటే చూడలేదూ పేపర్లో తలదూర్చేశారు. చెప్పు, ఫరవాలేదు... నాతో చెప్పడానికెందుకూ అంత బిడియం ...''

'' నువ్ ఊరికే కంగారుపడిపోతున్నావమ్మా ''

'' కూతురి కాపురం కొన్నాళ్లయ్యే వరకూ, పిల్లాపాప కలిగి వాళ్ల వాళ్ల బ్రతుకులు హాయిగా నడుస్తున్నాయనిపించేంత వరకూ ఆడపిల్లవాళ్లకి కంగారేనమ్మా ... ఉత్తరం రాయవు ... అతని కంటే ఆఫీసుపని ... నీకు ...''

'' ఏముంది రాయడానికి ... అయినా అట్లాంటివి రాయగలమా ? రాసిమాత్రం ప్రయోజనమేమిటి ?'' – ఆవేశంగా విప్పి చూపించింది తల్లికి.

'' అరెరె! ఇంతటి ప్రబుద్ధుడా మీ ఆయన – అంతలేసిపంటి గాట్లే... అదేం ముద్దే తల్లీ .... పువ్వును పువ్వులా చూసుకోవాలికాని ... ఇదేమిటి ? ...

'' అదంతే ! ...''

'' అంతేనని గదితలుపులు గడియవేసుకుని పడుకుంటావా ?''

'' రెండురోజులు వేరే పడుకుంటే ఆయనకే తెలిసివస్తుందని ....''

'' నీ మొహం .... ఇంతకీ నువ్ ... నువ్వేంచేశావో ...''

ప్రభాకరం లోపలకి రావడంతో తల్లీ కూతుళ్లూ మొహాలుచూసుకున్నారు.

'' రమేష్ ఆఫీసర్ కదా ... టేస్ట్ అంటాడు – రొటీన్ అంటాడు... ఏమిటా టేస్ట్ ... మనం రాగానే వెళ్లిపోయాడు. నాకేదో అనుమానం ? ఉంది ....''

'' మనం ఒంటరిగా మాటాడుకోవాలని ఈ అవకాశం మనకి ఇవ్వడానికి వెళ్లినట్టుంది ...

మీరు బజారుకి వెళ్లి వెంటనే బోరోలీన్ తీసుకురండి... ఎనిమిదన్నరయింది కొట్లు తెరుస్తారు. దోవలో పళ్లూ... కూరలూ ...''

ప్రభాకర్ బ్యాగ్ తీసుకుని బయలుదేరాడు.

'' ఇంకా చెప్పు ... కొంత మంది ముద్దు అంతే - కోరిక పట్టలేక ...ఇంతకీ నువ్ ఏం చేశావ్? అతన్ని అడగలేనుకదా ... మీ నాన్న గారుమరీని, ఆయన కొత్త పెళ్లికొడుకులాగా, అల్లుడే మామలాగా ఆయనే సిగ్గుపడిపోతూ ఉంటారు ..... ఆయనదంతా ఓ ఇదిలే ...''

'' నేనేం చేశాను? నిజం చెబుతా వినమ్మా... నేను నిద్దర్లో ఆయనమీద కాళ్లు పడేస్తానట... పక్కమీద మూడంకె వేస్తానట ... దుప్పటి లాగేస్తానట తన పక్క మనిషి ఉంటే. ఆయనకి ఎలాగో ఇబ్బందిగా ఉంటుందట... ఘర్షణ ఎందుకని ...''

'' ఎన్నాళ్లైంది ఈ వేరుపడకలు ... ?''

'' ఏవో రెండు రాత్రులే ... ?''

''ఇంకా నయం! వెధవ్వేషాలు వెయ్యక తిన్నగా ఉండు. దంపతుల మధ్య పోట్లాట పొద్దు కూకే లోపల సద్దుమణిగి పోవాలి....''

ప్రభాకర్ ఇంటికి రాగానే చెప్పింది అరుంధతి.

'' మనం వెంటనే బజారుకెళ్లాలి... ''

'' ఇప్పుడేగా వచ్చాను!''

'' అది కాదండీ ... ఆ మంచాలు చిన్నవై పోయాయి. బరువని మనం ఇచ్చినవి అక్కడ వది లేసి చిన్నవీ, పాతవీ, తెచ్చుకున్నారు.... ''

అల్లుడు వచ్చేసరికి వంట పూర్తి చేసింది అరుంధతి. అందరి భోజనాలూ అయ్యాక '' నాకు నిద్రవస్తోంది'' అంటూ రమేష్ ఒక గదిలోకి వెళ్లి పడుకున్నాడు.

'' మేం బజారుకు వెళుతున్నాం... మినపప్పు నే వచ్చి గ్రైండ్ చేస్తా....''

నాలుగు గంటలయ్యే సరికి పెద్ద డబుల్ కాట్ డన్‌లప్ పరుపూ వచ్చేశాయి.

'' నాకు అర్జంటు పనిఉంది... నే వెళ్లివస్తా '' అన్నాడు ప్రభాకర్.

'' అన్నీ గదిలో సర్దేశా... నాకు మాత్రం ఇక్కడపనేం ఉందీ '' అంటూ అరుంధతీ బయలుదేరిపోయింది. - రమేష్, లక్ష్మీ గుమ్మంలో నిలబడి వీధిచివరకి వెళ్లే వరకూ తమవంకే చూస్తూ ఉంటారనుకున్న అరుంధతి వెనక్కి తిరిగి చూసేసరికి ఇద్దరూ కనపడలేదు.

స్వాతి సపరివార పత్రిక

8-11-85